నూతన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలసిన ఐడీహెచ్ కాలనీవాసులు

బన్సీలాల్‌పేట్: ఐడీహెచ్ కాలనీవాసులు శనివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. ఐడీహెచ్ కాలనీలోని పురాతన 10 నెంబర్ 4, 5, 6 బ్లాక్‌లకు చెందిన వాసులు ఇటీవల కురుస్తున్న వర్షాలకు వారి ఇళ్ల పై కప్పు శిథిలాలు ఊడికింద పడ్డాయని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ వర్షాలకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నాయని స్థానికులు వాపోయారు. పురాతన ఇళ్ల స్థానంలో నూతన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. డబుల్ బెడ్రూం నిర్మాణాల పథకం ప్రస్తుతం లేదని హౌసింగ్ అధికారులతో మాట్లాడి మీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు వెంకటేషన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలను పర్యవేక్షించాలి

రసూల్‌పురా: యువత చెడుమార్గంలో వెళ్లి దురలవాట్లకు లోనుకాకుండా తల్లిదండ్రులు ఎప్పుడు తమ పిల్లలను పర్యవేక్షించాలని కార్ఖానా సీఐ అనురాధ ఆన్నారు. శనివారం పీఎస్ పరిధిలోని కాకాగూడ, అంబేద్కర్‌హట్స్‌లో మాదక ద్రవ్యాల దుష్ఫలితాలు, నివారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయికి అలవాటు పడి యువత, విద్యార్థులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోతున్నారని, నేరాలు చేయడానికి కూడా వెనుకాడడం లేదని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లో వస్తున్న మార్పులు గమనిస్తూ మంచిమార్గంలో నడిచేందుకు ప్రయత్నించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి అమ్మినా కొనుగోలు చేసినా చట్టపరంగా కఠిన చర్యలుంటాయని బస్తీల్లో ఎవరైనా డ్రగ్స్, గంజాయి అమ్ముతున్నట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఎస్‌ఐలు, సిబ్బంది బస్తీవజలు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం దారుణం

ఉస్మానియా యూనివర్సిటీ: వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మండి పడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని భోసి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీరనారి చాకలి ఐలమ్మ కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ధ్వంసం చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. విగ్రహాలు ధ్వంసం చేసే వారికి పైన హత్యయత్నం కేసులు నమోదు చేయాలన్నారు.

ఓయూ దూరవిద్యలో ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రంలో ఈ విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించు ఎంట్రన్స్ పరీక్షలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. వచ్చే నెల 7న జరిగే ప్రవేశ పరీక్షలకు 2వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగా రెడ్డి తెలిపారు. టీజీ ఐసెట్–2025లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో నేరుగా ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై యువకుల వీరంగం..

ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద బస్సు ఆపినందుకు దాడి

సనత్‌నగర్: ఆర్టీసీ డ్రైవర్‌పై ఇద్దరు యువకులు వీరంగం చేశారు. ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడడంతో బస్సు ఆపినందుకు ఎందుకు ఆపావంటూ దాడి చేసిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలేరుకు చెందిన ఎంఎంరెడ్డి (35) ఆర్టీసీ డ్రైవర్. ఈ నెల 15న తెల్లవారుజామున 3–4 గంటల మధ్య కంటోన్మెంట్ జేబీఎస్ ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రెడ్ సిగ్నల్ పడగా బస్సును ఆపాడు. అదే సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు స్కూటీపై వచ్చి ప్యాసెంజర్ డోర్‌ను కొట్టగా డ్రైవర్ ఎంఎంరెడ్డి ఓపెన్ చేశాడు. బస్సును ఎందుకు ఆపావంటూ దూషించడమే కాకుండా దాడికి దిగారు. రెడ్‌సిగ్నల్ పడిందని, అందుకే బస్సును ఆపానంటూ ఎంతచెప్పినా ఇద్దరూ వినిపించుకోలేదు. అతన్ని కొట్టడమే కాకుండా బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో బాధితుడు డయల్ 100కు ఫోన్ చేయగా వెంటనే పోలీసులు అక్కడికి చేరుకునే లోపే పరారయ్యారు. తనపై దాడి చేసిన యువకులపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముకుందా.. ముకుందా

కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ఆయా డివిజన్లలోని పలు ఆలయాల్లో కృష్ణుడి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అదే విధంగా చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు.

– సికింద్రాబాద్/కంటోన్మెంట్/ సనత్‌నగర్ జోన్ బృందం



లాలాపేట: తార్నాకలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఆత్మీయ మహిళా మండలి సభ్యురాళ్లు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కృష్ణాష్టమి వేడుకలు



అమీర్‌పేట: గోపికలు, చిన్ని కృష్ణుల వేషధారణలో చిన్నారులు





అడ్డగుట్ట: గోపికల వేషధారణలో చిన్నారులు





అడ్డగుట్ట: శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారి



రసూల్‌పురా: పూజల్లో పాల్గొన్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి



రసూల్‌పురా: బాలంరాయిలో కృష్ణుడి వేషాధారణలో చిన్నారి



లాలాపేట: వినోభానగర్‌లో వేషధారణలో చిన్నారులు



రసూల్‌పురా: యాదవసంఘం ఆధ్వర్యంలో బోయిన్‌పల్లిలో నిర్వహించిన పూజల్లో మహేశ్వర్‌రెడ్డి



సనత్‌నగర్: ఉట్టి కొడుతున్న విద్యార్థులు



మోక్షవీర సాయి, శాంతినగర్, అమీర్‌పేట్



సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో సందడిగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఆటల్ బిహారీ వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్‌కు నివాళులర్పిస్తున్న మర్రి పురురవరెడ్డి తదితరులు

పద్మారావునగర్: దేశ మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 7వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రునగర్‌లో బీజేపీ నాయకులు నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షులు రామంచ మహేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేఎం క్రిష్ణ, వై. సురేశ్, కె. క్రిష్ణ, శ్రీనివాస్ ముదిరాజ్, ఎస్.వై. గిరి, కిరణ్, నైనీష్, అరుణ్, ఇ. శ్రీనివాస్, సాయిరాం, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. దేశ ప్రధాన మంత్రి హోదాలో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. వాజ్‌పేయి ఆశయాలను, ఆదర్శలను స్ఫూర్తిగా తీసుకొని బీజేపీ శ్రేణులు సమాజహితం కోసం పని చేయాలన్నారు.

భారతరత్న వాజ్‌పేయ్ సేవలు చిరస్మరణీయం

మర్రి పురురవరెడ్డి

సనత్‌నగర్: మాజీ ప్రధానమంత్రి అటల్ బీహారీ వాజ్‌పేయ్ చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర నేత మర్రి పురురవరెడ్డి అన్నారు. వాజ్‌పేయ్ 7వ వర్ధంతి సందర్భంగా బేగంపేటలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేతలు సత్యనారాయణ, బాబురావు, గుంటి సత్యనారాయణ, కిరీటా, బి.వికాస్, ఎస్.చంద్రపాల్‌రెడ్డి, గోపీ శ్రీనివాస్, మల్లేశ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

నేడు తార్నాకలో మెగా రక్తదాన శిబిరం

లాలాపేట: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం తార్నాలో 7వ చిరంజీవి స్వచ్ఛంద ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లాలాపేట, తార్నాక చిరంజీవి, పవన్ కల్యాణ్ యూత్ అసోసియేషన్ నాయకులు పి. వేణుగోపాల్‌రెడ్డి, కె. కిరణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు శనివారం లాలాపేటలో వారు విలేకరులతో మాట్లాడుతూ తార్నాక చౌరస్తాలోని ప్రెసిడెంట్ కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్న ఈ రక్తదాన శిబిరం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4–30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. మెగాస్టార్ చిరంజీవి వలంటరీ బ్లడ్ డోనర్స్ క్లబ్‌లో చేరి రక్తదాతగా పేరు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్. 87901 51591, 98496 21690లో సంప్రదించాలన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దాం

– ఏసీపీలు సైదయ్య, సుబ్బయ్య



యువతకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న మహంకాళి ఏసీపీ సైదయ్య

రాంగోపాల్‌పేట్: డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు యువత ముందుకు రావాలని మహంకాళి, గోపాలపురం ఏసీపీలు సైదయ్య, సుబ్బయ్య యువతకు పిలుపునిచ్చారు. శనివారం గోపాలపురం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ ఆధ్వర్యంలో రెతిఫైల్ బస్టాండ్‌లో, మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం ఆధ్వర్యంలో పాన్‌బజార్‌లోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్ అనేది నేటి సమాజంలో యువత ఎక్కువగా వాడుతుండటం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. డ్రగ్స్ ద్వారా డబ్బు, ఆరోగ్యం దెబ్బతింటాయని అన్నారు. కొంత మంది అసాంఘిక శక్తులు తమ స్వార్థం కోసం యువతకు గాలం వేసి, వీటిని అలవాటు చేసి సొమ్ము చేసికుంటున్నారని తెలిపారు. ఎక్కడైనా వీటిని విక్రయిస్తున్నట్లు, వినియోగిస్తున్నట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1908 తెలియచేయాలని వారు సూచించారు. దేశం నుంచి డ్రగ్స్‌ను తరిమి కొట్టేందుకు యువత కంకణం కట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణస్వామి ముదిరాజ్ సేవలు మరువలేనివి



కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గణేశ్

రసూల్‌పురా: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్ నగర తొలి మేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ చేసిన సేవలు మరువలేనివని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కొర్వి కృష్ణస్వామి 131వ జయంతి వేడుకలను ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో జూబ్లీబస్‌స్టేషన్ వద్ద శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, ఎంపీ బండ ప్రకాష్ హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గణేశ్ మాట్లాడుతూ.. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని నమ్మి, అంబేడ్కర్, పూలేలను ఆదర్శంగా తీసుకొని వెనకబడిన వర్గాల్లో విద్యావ్యాప్తి కోసం కృషి చేశారని 1921లోనే హైదరాబాద్ నగరంలో బాలికల పాఠశాల ఏర్పాటు చేయించారని అన్నారు. 1957లో ఉమ్మడి రాష్ట్రంలో నగర తొలి మేయర్‌గా ఎన్నికయ్యారని ఆయన గొప్పదనాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో పాఠ్య పుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సామల హేమ, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, పిట్ల నగేష్, తెలంగాణలోని వివిధ జిల్లాల ముదిరాజులు పాల్గొన్నారు.

ఘనంగా కొరివి కృష్ణస్వామి జయంతి వేడుకలు

చిలకలగూడ: కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలు తెలంగాణ ముదిరాజ్ మహాసభ, సికింద్రాబాద్ శాఖ నేతృత్వంలో సీతాఫల్‌మండి ఛత్రపతి శివాజీ చౌరస్తాలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ ముఖ్యఅతిథిగా హాజరై కొరివి కృష్ణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ సికింద్రాబాద్ విభాగ ప్రతినిధులు సంజీవ్‌ముదిరాజ్, మేకల సారంగపాణి, యాదగిరి, సతీష్, కరాటే రాజు, శ్రీను, విజయ్, హరి, దీపిక ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

‘అన్యాయంగా సస్పెండ్ చేశారు?’

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మాజీ వీసీ ప్రొ.రవిందర్ తనను ఉద్యోగం నుంచి అన్యాయంగా సస్పెండ్ చేశారని సూపరింటెండెంట్ ఇంజినీర్ దేవదాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి నోటిసులు లేకుండా హఠాత్తుగా సస్పెండ్ చేసిన మాజీ వీసీ రవిందర్ తనకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓయూ క్యాంపస్‌లోని సీ హాస్టల్ పైకప్పు రేకుల మరమ్మతుల విషయంలో సస్పెండ్ చేసి, విచారణ చేపట్టారని, 9 నెలలు విచారణ చేపట్టి నివేదికను సమర్పించినా ఓయూ అధికారులు ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. నిబంధనల ప్రకారం సస్పెండ్ అయిన ఉద్యోగి పై విచారణ జరిపి రెండు సంవత్సరాలలోపు తిరిగి విధుల్లో తీసుకోవాలన్నారు. కానీ తను సస్పెండ్ చేసి రెండేళ్ల నాలుగు నెలలు గడుస్తున్నా ఇంత వరకు విధులోకి తీసుకోకపోవడం దారుణమన్నారు. ప్రస్తుత వీసీ ప్రొ.కుమార్ తనకు న్యాయం చేయాలని దేవిదాస్ కోరారు.

‘రక్తం తగ్గిందని వెళ్తే.. ప్రాణం తీశారు’

ఆస్పత్రి బయట బంధువుల ఆందోళన



ఆస్పత్రి ఎదుట బైటాయించి బంధువులను తరలించే ప్రయత్నం చేస్తున్న పోలీసులు

అమీర్‌పేట: రక్తం తగ్గిందని ఆస్పత్రికి వెళ్తే.. ఏకంగా ప్రాణాలు తీశారని ఆరోపిస్తూ బంధువులు అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ ఘన్‌పూర్ జఫర్‌గట్ మండలం, సాగరం వడ్డెర కాలనీకి చెందిన పూజ (26) అనారోగ్యంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వెళ్లగా, పరీక్షించి ఒంట్లో రక్తం తక్కువైందని అమీర్‌పేటలోని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రికి రెఫర్ చేశారని తెలిపారు. 13వ తేదీ సాయంత్రం ఆ ఆస్పత్రిలో చేర్పించగా రక్తం ఎక్కిస్తామని రక్తం కూడా తీసుకున్నట్లు, కానీ శనివారం ఉదయం పూజ మృతి చెందిందని మృతురాలి సోదరి చెప్పారు. వైద్యుల నిర్లక్ష్యంతో ఆమె మృతి చెందిందని, సకాలంలో చికిత్స చేయలేదని ఆరోపించారు. మృతురాలికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వైద్యులపై చర్యలు తీసుకోవాని కోరారు. వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరయ్య బాధితులకు అండగా వచ్చి యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు మోహరించి ఆందోళకారులను బలవంతంగా అక్కడి నుంచి తరళించే ప్రయత్నం చేశారు. దీంతో బాధితులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీనిపై ఆస్పత్రి యాజమాన్యాన్ని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. జరిగిన సంఘటనపై పత్రికా ప్రకటన విడుదల చేస్తామని వారు ప్రకటించారు. బాధితులు ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ముదిరాజ్ సమస్యలు తీసుకెళ్తా
- రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మెన్ బొర్రా జ్ఞానేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న కాసాని జ్ఞానేశ్వర్

బన్సీలాల్‌పేట్: ముదిరాజ్ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. సికింద్రాబాద్ బోయిగూడ ముదిరాజ్ భవన్‌లో శనివారం తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నగర మాజీ మేయర్, సంఘ సంస్కర్త కొర్వి క్రిష్ణస్వామి ముదిరాజ్ 132వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఓ యూనివర్సిటీకి కొర్వి క్రిష్ణస్వామి ముదిరాజ్ పేరు పెట్టడానికి, ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటుతో పాటు ఏటా ప్రభుత్వం తరపున కొర్వి క్రిష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలు జరిగేలా చేస్తానన్నారు. ముదిరాజ్ సంఘాలన్నీ కలిసి కట్టుగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నాయకత్వంలో ఓ వేదిక మీదకు రావాలని సూచించారు. ముదిరాజ్ కులస్తులను బీసీ– డీ నుంచి ఏ – గ్రూప్‌లోకి మార్చే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. విద్యాపరంగా ముదిరాజ్ కులస్తులు ఎదగాలన్నారు. అఖిల భారత ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ క్రిష్ణస్వామి ముదిరాజ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్ కులస్తుల సమగ్రాభివృద్ధికి ముదిరాజ్ మహాసభ నిర్మాణాత్మకమైన కార్యచరణతో పని చేస్తున్నదని పేర్కొన్నారు. ముదిరాజ్‌లు తమ పిల్లలను బాగా చదివించాలని కోరారు. ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు జి. దివాకర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ జగన్మోహన్, కాసాని వీరేష్, కార్పొరేటర్ సామల హేమ, శారద, ప్రకాష్ ముదిరాజ్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు దొడ్ల సదానంద్, శ్రీనివాస్, సురేందర్, శ్రీకాంత్, మన్మోహన్, కరాటే రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.